క్లుప్తంగా

హామీని నెరవేర్చిన సీఎం



మాట్లాడుతున్న మదార్

నెల్లూరు(బారకాసు): టైలరింగ్ వృత్తిదారుల కోసం కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తామనే హామీని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టుకున్నారని టైలరింగ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు మదార్ పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడారు. టైలరింగ్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి రూ.100 కోట్లను మంజూరు చేసిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. తమ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయ నిర్మాణానికి అవసరమైన భూమిని మంజూరు చేయించిన నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌కు కృతజ్ఞతలను తెలియజేశారు. యానాదయ్య, సుందరం, మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

15న వాహనాల వేలం

నెల్లూరు(క్రైమ్): జిల్లా పోలీస్ విభాగానికి సంబంధించి కాలం చెల్లిన 22 వాహనాలను ఈ నెల 15న వేలం వేయనున్నామని జిల్లా పోలీస్ కార్యాలయాధికారులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా వేలం జరగనుందని, ఆసక్తి గల వారు konugolu. ap. gov. inలో బిడ్డింగ్ చేయాలని కోరారు. వేలం వేసే వాహనాలు నెల్లూరు పోలీస్ కార్యాలయంలో ఉన్నాయని, ఆసక్తి గల వారు పరిశీలించుకోవచ్చన్నారు. వివరాలకు 94407 96368, 99857 80360 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

జ్వరాల నియంత్రణకు చర్యలు చేపట్టరూ..

నెల్లూరు(అర్బన్): జిల్లాలోని పలు మండలాల్లో ప్రబలుతున్న విషజ్వరాలను నియంత్రించేలా చర్యలు చేపట్టాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యశ్వంత్‌సింగ్ కోరారు. ఈ మేరకు సంతపేటలోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓకు పెంచలయ్యకు వినతిపత్రాన్ని బుధవారం అందజేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, నేతలు వంశీధర్‌రెడ్డి, హర్ష, పెంచలకృష్ణ, కార్తీక్, రాము, రమేష్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్ర తాత్కాలికంగా వాయిదా

నెల్లూరు(బారకాసు): ఆర్టీసీ విశ్రాంత కార్మికులకు సూపర్ లగ్జరీల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలని కోరుతూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు తలపెట్టిన పాదయాత్రను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరప్రసాద్ పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడారు. తమ సమస్యలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కరిస్తారనే నమ్మకం ఉందని చెప్పారు.

పేదలకు వస్త్రాల అందజేత



నెల్లూరు(అర్బన్): నగరంలోని పేదలకు వస్త్రాలను వరపరివార్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం పంపిణీ చేశారు. నగరానికి చెందిన వెంకటశివాని, లీలామోహన్ జన్మదినాన్ని పురస్కరించుకొని కార్యక్రమాన్ని చేపట్టారు. ఫౌండేషన్ అధ్యక్షురాలు మాధవి, తదితరులు పాల్గొన్నారు.

బేకరీ సీజ్



నెల్లూరు సిటీ: మాగుంట లేఅవుట్లోని ఓ బేకరీలో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను విక్రయిస్తున్నారని గుర్తించిన ఎంహెచ్‌ఓ వెంకటరమణ సీజ్ చేశారు. తన బృందంతో కలిసి బేకరీలో ఆకస్మిక తనిఖీలను బుధవారం ఆయన చేపట్టారు. నిల్వ ఉంచి, కాలపరిమితి పూర్తయిన ఆహారాన్ని గుర్తించారు. బ్రెడ్, ఇతర ఆహార పదార్థాలను చెత్త వాహనంలోకి తరలించారు. అనంతరం దుకాణాన్ని సీజ్ చేసి నిర్వాహకుడికి నోటీసులను జారీ చేశారు.

ఏడుగురు రౌడీషీటర్ల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): నేరం చేసేందుకు యత్నిస్తున్న ఏడుగురు రౌడీషీటర్లను సంతపేట పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. వేదాయపాళేనికి చెందిన గణేష్ పవన్, సందీప్‌రెడ్డి, యాసిర్, నవాబుపేటకు చెందిన అబ్దుల్ రెహ్మాన్, చిన్నబజార్‌కు చెందిన రోషన్, ఫక్రుద్దీన్, సంతపేటకు చెందిన ఇంద్ర రౌడీషీటర్లు. తిక్కన పార్కు వద్ద కత్తులు, కర్రలతో నేరాలు చేసేందుకు మంగళవారం అర్ధరాత్రి యత్నిస్తుండగా, సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా ఘటన స్థలానికి చేరుకొని వారిని అరెస్ట్ చేశారు.

ప్రజల ఆశీస్సులతో ముందుకెళ్తున్నా


మాట్లాడుతున్న అనిల్‌కుమార్

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): తనకు.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అండగా నిలిచారని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. 39, 40వ డివిజన్లకు సంబంధించిన ఆత్మీయ సమావేశాన్ని మూలాపేటలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత షంషీర్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. 2014, 2019 ఎన్నికల్లో 39, 40వ డివిజన్లలోని మూలాపేట, మన్సూర్‌నగర్, జెండావీధి, తదితర ప్రాంతాల ప్రజలు అండగా నిలిచారని.. జగనన్న, ప్రజల ఆశీస్సులతో ముందుకెళ్తున్నానని చెప్పారు. తనను అక్కున చేర్చుకున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలను తెలియజేశారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా చిల్లర రాజకీయాలు చేయలేదన్నారు. అసెంబ్లీలో గానీ బయట ఎక్కడ మాట్లాడినా ప్రజల కోసమే తప్ప, ఎవర్నీ ఇబ్బంది పెట్టలేదని చెప్పారు. గడప గడపకూ వెళ్లి సమస్యలను తెలుసుకొని పరిష్కరించడంలో ముందుంటానని వివరించారు. మంత్రి పదవి దూరమయ్యాక కొందరు తనను వదిలెళ్లారని చెప్పారు. 2019 ఎన్నికల అనంతరం దూరంగా ఉన్న నారాయణ 2024లో తనకు పోటీగా వస్తారని కొందరు అనుకుంటున్నారని పేర్కొన్నారు. ఓట్ల కోసం ప్రజల వద్దకు వెళ్తానే తప్ప, ఎవరి సాయం కోరేది లేదని స్పష్టం చేశారు. రెండు రోజుల క్రితం ఓ కార్పొరేటర్ కార్యాలయాన్ని ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేస్తే, దాన్ని తనపై రుద్దేందుకు యత్నించారని ఆరోపించారు. విధ్వంసానికి కారకులు పోలీసుల ఎదుట లొంగిపోయి.. వారి మధ్య ఉన్న గొడవలను బయటపెట్టారని.. ఇలాంటి చిల్లర రాజకీయాలను తనపై రుద్దడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. తాను వందల కోట్లు సంపాదించానంటూ కొందరు నిందలు మోపారని, మంత్రిగా ఉన్న సమయంలో నిజాయతీగా పనిచేసిన విషయాన్ని ఏ అధికారిని అడిగినా చెప్తారన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, జంగం కార్పొరేషన్ చైర్‌పర్సన్ ప్రసన్న, పార్టీ నేతలు సునీల్, ప్రసాద్, అరుణమ్మ, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన రీ సర్వే పూర్తి


మాట్లాడుతున్న చిరంజీవి

నెల్లూరు(పొగతోట): భూముల రీ సర్వే (స్వామిత్వ) ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జెడ్పీ సీఈఓ, ఇన్‌చార్జి డీపీఓ చిరంజీవి ఆదేశించారు. జెడ్పీ సమావేశ మందిరంలో ఈఓపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రీ సర్వే పూర్తయిన వివరాలను నిర్దేశించిన నమూనాలో అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. పొరపాట్లు లేకుండా సర్వేను పూర్తి చేయాలని, ఏమైనా సమస్యలొస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

హుండీ కానుకల లెక్కింపు



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో హుండీ కానుకలను బుధవారం లెక్కించారు. గతేడాది అక్టోబర్ ఏడు నుంచి కానుకల రూపంలో రూ.39,66,237, అన్నదాన హుండీ ద్వారా రూ.1,71,725, అమెరికన్ డాలర్లు 152, ఒమానీ రియల్ 200, బంగారం 281 గ్రాములు, వెండి 425 గ్రాములను భక్తులు అందజేశారని ఈఓ గిరికృష్ణ పేర్కొన్నారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రత్నం జయరామ్, దేవదాయ శాఖ నెల్లూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



నెల్లూరు(వీఆర్సీ సెంటర్): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించిన సిటీ నియోజకవర్గ గ్రిగ్స్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన వెంకటేశ్వరపురంలోని నగరపాలక ఉన్నత పాఠశాల విద్యార్థులను బుధవారం అభినందించారు. కబడ్డీ, ఖోఖో పోటీల్లో బాలుర, బాలికల విభాగాల్లో మొదటి స్థానాలను విద్యార్థులు సాధించారు. ఈ క్రమంలో వీరిని ప్రధానోపాధ్యాయురాలు మంజులవాణి, కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యుడు జమీర్ అహ్మద్ అభినందించి మెడళ్లు, సర్టిఫికెట్లను అందజేశారు. ఉపాధ్యాయులు రాజమనోహర్, శారద, చినమస్తానయ్య, .ధన్‌రాజ్, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

మెషీన్ హోల్స్ దిశగా కార్పొరేషన్



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన హరిత

నెల్లూరు సిటీ: నగరంలోని మ్యాన్ హోల్స్‌ను మెషీన్ హోల్స్ దిశగా మారుస్తున్నామని కమిషనర్ హరిత పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు ఆమె హాజరయ్యారు. ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన నిర్వహించనున్న కార్యక్రమంలో పాల్గొనే అవకాశం లభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఎస్‌ఈ సంపత్‌కుమార్, ఈఈలు సంజయ్, చంద్రయ్య, సహదేవయ్య, నవజీవన్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న నారాయణరెడ్డి

నెల్లూరు(బారకాసు): ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. మినీబైపాస్ రోడ్డులోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడారు. పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో దయాకర్‌రెడ్డి, బ్రహ్మానందానికి మొదటి ప్రాధాన్య ఓటేసి గెలిపించాలని కోరారు. పార్టీ నేతలు సురేష్‌రెడ్డి, భరత్‌కుమార్‌యాదవ్, రమేష్, యశ్వంత్‌సింగ్, గిరికుమార్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని వెంకటేశ్వరపురం సెంటర్‌లో గల మాజీ రాష్ట్రపతి జాకీర్‌హుస్సేన్ విగ్రహం, ఐల్యాండ్‌లో పిచ్చి మొక్కలను బుధవారం తొలగించి శుభ్రపర్చారు. ట్రాఫిక్ ఐల్యాండ్ రూపు కోల్పోయిన అంశంపై 'ఆలనాపాలన కరువు' అనే శీర్షికన సాక్షిలో కథనం సోమవారం ప్రచురితమైంది. ఈ క్రమంలో స్థానిక శానిటరీ సెక్రటరీ లీలాకుమారి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులతో శుభ్రం చేయించారు. దీంతో ఐల్యాండ్‌లో పరిశుభ్ర వాతావరణం ఏర్పడింది.

ఏడున చండీహోమం

నెల్లూరు(బృందావనం): ఫాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకొని మూలాపేటలోని శంకరమఠంలో చండీహోమాన్ని ఈ నెల ఏడున నిర్వహించనున్నామని నిర్వాహకుడు నందకిషోర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హోమంలో పాల్గొనాలనుకునే వారు 96528 60264, 99499 18358 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని తెలుగుగంగ సబ్‌స్టేషన్లో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా గురువారం ఉండదని ఐతు సెక్షన్ ఏఈ లక్ష్మీనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శివాజీనగర్, ఎన్‌సీసీ కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదన్నారు.

'ఎల్‌ఎల్‌ఎఫ్'లో వైజ్ఞానిక ప్రదర్శన



నెల్లూరు(అర్బన్): జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని వేదాయపాళెంలోని లిల్లీ లిటిల్ ఫ్లవర్ స్కూల్లో నిర్వహిస్తున్న వైజ్ఞానిక ప్రదర్శన బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా కరస్పాండెంట్ కృష్ణచైతన్య మాట్లాడారు. 400 నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారని చెప్పారు. అనంతరం విజేతలకు యంగ్ సైంటిస్ట్ పేరిట అవార్డులను అందజేశారు.

పేర్నాటికి సంఘీభావం



నెల్లూరు రూరల్: తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రూరల్ నియోజకవర్గ నేతలు సంఘీభావం తెలిపారు. తిరుపతిలో బుధవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో సురేష్‌రెడ్డి, సురేష్, సాయిరెడ్డి, వంశీ పాల్గొన్నారు.

అమీనియా మసీదులో ప్రత్యేక దువా

నెల్లూరు(బృందావనం): మానవాళి శాంతిని కాంక్షిస్తూ కోటమిట్టలోని అమీనియా మసీదులో ప్రత్యేక దువాను ముస్లిం యూత్ సేవా జిల్లా అధ్యక్షుడు ఖాలిద్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఇమామ్ అబ్దుల్ హఫీజ్, మౌజన్ అంజద్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం


రమణయ్య


మస్తాన్‌రెడ్డి


వెంకటేశ్వరరావు (ఫైల్)

నెల్లూరు(అర్బన్): ఇందుకూరుపేట మండలం కొత్తూరుకు చెందిన రమణయ్య(80), కనుపర్తిపాడుకు చెందిన మస్తాన్‌రెడ్డి (71), తిరుపతికి చెందిన వెంకటేశ్వరరావు (62) మృతి చెందారు. ఈ క్రమంలో వీరి కుటుంబసభ్యుల అంగీకారంతో నేత్రాలను జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్రదాన మోటివేటర్ బాలాజీసింగ్, ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ లాలేష్ సేకరించారు. కుటుంబసభ్యులకు నేత్రదాన సర్టిఫికెట్లను అందజేశారు. నేత్రదానం చేయాలనుకునే వారు 99481 64781, 93471 11033 నంబర్లను సంప్రదించాలని బాలాజీసింగ్ కోరారు.

జక్కా పార్వతమ్మకు నివాళి



నెల్లూరు(వేదాయపాళెం): సీపీఎం నేత, దివంగత జక్కా వెంకయ్య సతీమణి పార్వతమ్మకు ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నివాళులర్పించారు. బాలాజీనగర్‌లోని డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్‌లో నిర్వహించిన సంతాప సభలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఐద్వా నేత మస్తాన్‌బీ, గ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ అన్నపూర్ణ, అంగన్‌వాడీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రెహనాబేగం, ఐద్వా ఉపాధ్యక్షురాలు విజయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గౌతమ్‌నగర్‌లో 'ఫ్యామిలీ డాక్టర్'

కొడవలూరు : మండలంలోని గౌతమ్‌నగర్‌లో కొడవలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఓపీ ద్వారా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఓపీకి రాలేని స్థితిలో ఉన్న ఇద్దరి ఇళ్లకు వైద్య సిబ్బంది వెళ్లి పరీక్షలు చేశారు.

సఖి వన్‌స్టాప్ సెంటర్‌లో తనిఖీ


మాట్లాడుతున్న వెంకటలక్ష్మి

నెల్లూరు(అర్బన్): పెద్దాస్పత్రి ఆవరణలోని దిశ పోలీస్‌స్టేషన్, సఖి వన్‌స్టాప్ సెంటర్‌ను ఏపీ మహిళా కమిషన్ సభ్యురాలు వెంకటలక్ష్మి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సఖిలో నమోదయ్యే గృహ హింస, మహిళలపై అఘాయిత్యాలు, తదితర అంశాలను పరిశీలించారు. గృహ హింసకు సంబంధించి దిశ పోలీస్‌స్టేషన్లో ఉన్న ఇద్దరు బాధితులతో మాట్లాడి వారికి భరోసా కల్పించారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి సౌజన్య, సఖి అడ్మిన్ షెహనాజ్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లపై చర్యలకు వినతి



నెల్లూరు రూరల్: రూరల్ పరిధిలోని 1, 2వ డివిజన్లలో వెలుస్తున్న అక్రమ లేఅవుట్లపై చర్యలు చేపట్టాలని కార్పొరేటర్లు నాగరాజు, రామ్మోహన్ కోరారు. ఈ మేరకు నుడా కార్యాలయంలో వైస్ చైర్మన్ బాపిరెడ్డి, నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ హరిత, ఆర్డీఓ కార్యాలయంలో పరిపాలనాధికారి శ్యామలమ్మకు వినతిపత్రాలను బుధవారం వారు అందజేశారు. ఎలాంటి అనుమతుల్లేకుండా లేఅవుట్లను వేయడమే కాకుండా ప్రభుత్వ స్థలాలను యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. విచారణ జరిపి చర్యలు చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే అనిల్‌కు సన్మానం



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌ను నగరంలోని ఆయన నివాసంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ విజయ్‌కుమార్ బుధవారం సత్కరించారు. తనకు పదవి రావడానికి ఎమ్మెల్యే సహకరించారని చెప్పారు. డీఏబీ జిల్లా చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఇందుకూరుపేట కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో ఒకరికి ఆర్నెల్ల జైలు

నెల్లూరు(లీగల్): ధాన్యాన్ని కొనుగోలు చేసి నగదును చెల్లించే క్రమంలో చెల్లని చెక్కులను ఇచ్చారనే కేసులో నేరం రుజువు కావడంతో బాపట్ల మండలం అప్పికట్లకు చెందిన ఇనగంటి గాంధీకి ఆర్నెల్ల జైలుతో పాటు చెక్కుల మొత్తం రూ.70 లక్షలను ఫిర్యాదికి పరిహారంగా మూడు నెలల్లోపు చెల్లించాలని నెల్లూరు రెండో అదనపు మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ప్రసూన బుధవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు.. ప్రకాశం జిల్లా లింగసముద్రం మండలం, చిన్నపవనికి చెందిన మాలకొండయ్య వ్యవసాయం చేస్తూ రైతుల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేసి రైస్‌మిల్లర్లకు అప్పునకు వేస్తూ వారి వద్ద నగదును తీసుకొనే వారు. ఈయన వద్దకు అనూరాధ రైస్ ట్రేడర్స్ యజమాని గాంధీ వెళ్లి తనకు ధాన్యాన్ని సరఫరా చేయాలని కోరారు. దీనికి సమ్మతించిన మాలకొండయ్య రైతుల నుంచి సుమారు రూ.1.05 కోట్ల విలువైన ధాన్యాన్ని 2016 మార్చి 23 నుంచి ఏప్రిల్ ఏడో తేదీ వరకు సరఫరా చేశారు. ఈ నేపథ్యంలో ఆంధ్రాబ్యాంక్ బ్రాంచ్ అప్పికట్ల, బాపట్ల పేరిట రూ.70 లక్షలకు ఐదు చెక్కులను పలు తేదీల్లో మాలకొండయ్యకు గాంధీ ఇచ్చారు. వీటిని నెల్లూరులోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నవాబుపేట బ్రాంచ్‌లోని తన ఖాతాలో జమ చేయగా, బౌన్స్ తిరిగొచ్చాయి. దీంతో న్యాయవాది ద్వారా మాలకొండయ్య 2017, మే 23న లీగల్ నోటీసును గాంధీకి పంపి కోర్టులో కేసు దాఖలు చేశారు. విచారణలో నిందితుడిపై నేరం రుజువు కావడంతో పైమేరకు తీర్పు చెప్పారు.

తెలుగుగంగ ఎస్‌ఈకి అభినందన



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): సంగం, నెల్లూరు బ్యారేజీలకు సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్ జాతీయ స్థాయి ఎక్సలెన్సీ అవార్డులను కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంపై బీజేపీ నేత మిడతల రమేష్ హర్షం వ్యక్తం చేశారు. దీనికి విశేష కృషి చేసిన అప్పటి తెలుగుగంగ ఎస్‌ఈ హరినారాయణరెడ్డికి పుష్పగుచ్ఛాన్ని బుధవారం అందజేసి అభినందించారు. నేతలు ప్రవీణ్‌కుమార్, ఫణిరాజు, రవి, నారాయణ, కృష్ణ, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.